# టిట్ ఫర్ టాట్

- ఇలపావులూరి మురళీమోహనరావు

ఆరోజు ఆదివారం. శెలవు దినమే అయినా పత్రికాఫీసులోని తన గదిలో కూర్చుని నాలుగు వారాల తరువాత రాబోయే ప్రత్యేక సంచికలో ప్రచురించవలసిన అంశాలను పరిశీలిస్తున్నాడు సంపాదకుడు విశ్వపతి.

విశ్వపతి సంపాదకుడైన తరువాత పత్రిక సర్క్యులేషన్ బాగా పెరిగింది. చూడగానే ముద్దొచ్చే కవర్ పేజీ, పాఠకుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండే ఫీచర్స్, సబ్జక్టులో సత్తా ఉంటే కొత్తా పాతా అనే భేదం లేకుండా రచయితలను ప్రోత్సహించడంలాంటి అనేక సంస్కరణలు చేపట్టి పత్రికకోసం పాఠకులు ఎదురుచూసేలా చేశాడు.

పాఠకుల ఉత్తరాలను కేవలం ప్రచురించడమేకాక వారి ఉత్తరాల క్రింద చిన్న చిన్న సమాధానాలు వ్రాయడం పాఠకులను ఎంతో ఆకర్షించింది. అప్పుడప్పుడు వారి సూచనల మేరకు స్వల్ప మార్పులను చేసేవాడు. దాంతో పాఠకుల అభిప్రాయాలకు నిజంగా విలువిచ్చే ఎడిటర్‌గా పేరు సంపాదించాడు. పాఠకులు తమ తోటివారికి చెప్పేవారు. దానివలన ఆనోటా, ఈనోటా ప్రచారం విపరీతంగా లభించేది. ఇరవై వేల సర్క్యులేషన్ గల పత్రికను సంవత్సరం తిరిగేసరికి లక్ష ప్రతులకు పెంచాడు.

విశ్వపతి ఉత్తరాలు చూస్తున్నాడు-

''అయ్యా- ఇంతవరకు నా ఉత్తరాలు వివిధ పత్రికలలో వెయ్యిసార్లు ప్రచురించబడ్డాయి. నాపేరు గిన్నీస్ బుక్‌లోకి ఎక్కుతుందా?...''

నవ్వుకున్నాడు విశ్వపతి. సమాధానం రాశాడు.

''తప్పకుండా గిన్నీస్ బుక్ కొనుక్కుని మధ్యలో ఎక్కడైనా మీపేరు రాసుకోండి. (సం)

ఇంతలో తలుపు చప్పుడైంది. ఎవరో నడివయస్కుడు! 'లోపలకి రావచ్చా' అన్నాడు దాదాపు లోపలకు వచ్చేసి.

''రండి'' అన్నాడు విశ్వపతి.

''నమస్కారం. కూర్చోవచ్చా?'' అంటూ కూర్చున్నాడు.

''నాపేరు అభినవ నన్నయ్య ఆదిశంకరాచార్యులు.'' అన్నాడాయన.

''అభినవ నన్నయ్య మీ ఇంటిపేరా?''

''లేదండీ.. అది నా బిరుదం.''

''బాగుంది. మీకు ఎవరిచ్చారీ బిరుదును.''

''లక్షలాదిమంది నా అభిమానులు. పద్యంలో, వచనంలో, గేయంలో, నాటకంలో, గద్యంలో చాలా కృషిచేశాను. నాపేరు మీరు వినే ఉంటారు.''

కొంచెం ఇబ్బంది పడ్డాడు విశ్వపతి. నిజానికి ఆపేరు తానెన్నడూ వినలేదు.

''మీరు ఏం రాశారు?'' అడిగాడు.

''దాదాపు రెండువందల కథలు రాశాను.'' అన్నాడతను.

ఆశ్చర్యపోయాడు విశ్వపతి. దాదాపు పాతికేళ్ళ నుంచీ పత్రికలలో పనిచేస్తున్నాడు తను. మార్కెట్లోకి వచ్చే అన్ని దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక పత్రికలను చూస్తుంటాడు. కానీ ఎక్కడా ఈయన పేరు చూడలేదు. ఒక నిముషంపాటు తన సంపాదకత్వం మీద తనకే అనుమానం వచ్చింది విశ్వపతికి. అన్ని కథలు వ్రాసిన ఆయన పేరు వినలేదంటే తనకే అవమానం అనిపించింది. అయినా నిగ్రహించుకున్నాడు.

''మా పత్రికలో ఏవైనా వ్రాశారా?'' అడిగాడు.

''దాదాపు వంద కథలు మీకు పంపించాను. అన్నీ తిరిగొచ్చాయి'' కొంచెం సిగ్గుపడుతూ చెప్పాడతను.

భయం కొద్దిగా తగ్గింది విశ్వపతికి.

''ఏ పత్రికలలో వ్రాశారు?'' ప్రశ్నించాడు.

సంచిలోంచి పది పత్రికలను బయటకు తీశాడతను.

అవన్నీ బెత్తెడుసైజులో పది పన్నెండు పేజీలతో ఉన్న స్థానిక పత్రికలు. కేవలం ఏభైమందో, వందమందో చందాదారులకు మాత్రమే పంపించేవి. ఇలాంటి పత్రికొకటి మన వీధిలో ఉన్నదని ఆ వీధిలో వారికి కూడా బహుశ తెలిసుండదు.

గాఢంగా నిశ్వసించాడు విశ్వపతి.

''సరే.. ఇప్పుడు మీరు వచ్చిన విషయం?'' అడిగాడు.

''అక్కడికే వస్తున్నా.. ఒకరోజు ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువుగట్టు వెంట వెళుతున్నా. దారిపొడవునా ఎంతో మంది అభాగ్యులు. స్వరాజ్యం వచ్చి అయిదు దశాబ్దాలు గడిచినా పల్లెటూర్లలో కాలకృత్యాలు తీర్చుకోవాలంటే కాలువలు, చెరువులే గతి. పందులు చుట్టూ మూగుతుంటాయి. ఒక్కోసారి పంది ముట్టెతో మనిషిని తోసేస్తుంది...''

అసహనంగా ఫీలయ్యాడు విశ్వపతి.

''కథ చెబుతున్నారా?'' అడిగాడు.

''లేదు.. లేదు.. నా కథకు ప్రేరణ చెబుతున్నాను'' కంగారుగా అన్నాడు శంకరాచార్యులు.

''సారీ.. నాకంతటైం లేదు. ప్రేరణలు, స్ఫూర్తులు వద్దు. కథ నాకివ్వండి చాలు. దాన్ని నేను చదువుతాను. బాగుంటే తప్పకుండా ప్రచురిస్తాను'' అన్నాడు విశ్వపతి.

''అమ్మమ్మ... ఎంతమాట. మీకు తప్పకుండా నచ్చుతుంది. ప్రకృతి సాక్షిగా చేసిన రచన'' అంటూ సంచీలోంచి మరొక దస్త్రం బయటకు తీశాడు.

> ''అయ్యా.. ఈ రచన చెయ్యడానికి వెయ్యి టీలు తాగాను.
> రెండువందల సారిడాన్ బిళ్ళలు వేసుకున్నాను.
> నలభై రాత్రుళ్ళు జాగరణ చేశాను. నాశ్రమ వృధాపోనీకండి.
> కావాలంటే మీ పత్రికకు రెండు జీవిత చందాలు కడతాను''
> లేస్తూ అన్నాడు శంకరాచార్యులు.

''అవధరించండి. ఇదే నా రచనా రాజం. నా సాహితీ శిల్ప వైభవానికి దర్పణం. పాఠకులను విశేషంగా ఆకర్షించగల అయస్కాంతం.'' టేబుల్ మీద పెట్టాడు.

''మైగాడ్.. చాలాపేజీలున్నాయి. ఇది కథ కాదు.

నవల అనాలి'' దాన్ని పట్టుకుని అన్నాడు విశ్వపతి.

నవ్వాడు శంకరాచార్యులు.

''అలాగే అనుకోండి. పూచిన పువ్వు భగవంతుడి పాదాలవద్ద పడినపుడు, పక్వానికొచ్చిన పండు జవ రాలి మునిపంట కొరకబడినపుడు, తన మెదడుకు పదునుపెట్టి రక్తాన్ని సిరాగామార్చి రచయిత చేసిన రచన పత్రికలో అచ్చయినపుడు వాటి జన్మలు ధన్య మౌతాయి. అందువలన నేను చెక్కిన ఈ శిల్పానికి మీరు ప్రాణ ప్రతిష్ఠ చెయ్యాలి'' రెండు చేతులు జోడించి ప్రాధేయపూర్వకంగా అన్నాడు శంకరాచా ర్యులు కాళ్ళు రెండూ ఎత్తి కుర్చీలో గువ్వలా ముడు క్కుని కూర్చుంటూ.

అతను కూర్చున్న విధానం చూస్తే తాడో పేడో తేల్చిందాకా వదిలేట్టులేడు.

రచయిత ఎంత చనువున్నవాడైనప్పటికీ ఇలా ఎదురుగా కూర్చుని మొహమాట పెట్టడం ఏ ఎడిట ర్కైనా కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది.

''రచన చాలా పెద్దదిగా ఉన్నట్లుంది'' అన్నాడు విశ్వపతి.

''అవును. మొదట మినీకథగా రాయాలనుకు న్నాను. కానీ విషయం పెరిగి కథైంది. కథగా ముగి ద్దామనుకున్నాను. చూస్తుండగానే నవలిక అయింది. కానీ విషయం ఇంకా విస్తృతంగా వివరంగా చెప్పాల నిపించింది. దాంతో నవలైంది'' చెప్పాడు శంకరాచా ర్యులు.

''దీనిని మా పత్రికకు అనుగుణంగా మార్పు చేసు కునే హక్కు మాకుంటుంది'' అన్నాడు విశ్వపతి.

''ఎంతమాట.. ఎడిటర్‌కున్న ఆ హక్కు ప్రపంచ వ్యాప్తంగా అంగీకరించబడిందే. నాకు మినహా యింపు ఉండదు కదా..'' అన్నాడాయన చిరున వ్వుతో.

''వెరీగుడ్. మీకు త్వరలోనే ఏ విషయమూ తెలి యజేస్తాం. మీరు వెళ్ళిరండి'' వాచీ చూసుకుంటూ అన్నాడు విశ్వపతి.

''అయ్యా.. ఈ రచన చెయ్యడానికి వెయ్యి టీలు తాగాను. రెండువందల సారిడాన్ బిళ్ళలు వేసుకు న్నాను. నలభై రాత్రుళ్ళు జాగరణ చేశాను. నా శ్రమ వృథాపోనీకండి. కావాలంటే మీ పత్రికకు రెండు జీవిత చందాలు కడతాను'' లేస్తూ అన్నాడు శంకరా చార్యులు.

ఊపిరి పీల్చుకున్నాడు విశ్వపతి. క్షవరం చేయించు కుని తలంటు పోసుకున్నంత హాయిగా ఉన్నది పుడు.

ఆ తరువాత ఐదారు నెలలు గడిచాయి. ఈలోపల దాదాపు- రాజమండ్రి నుంచి- వందసార్లు యస్.టి.డి. చేశాడు శంకరాచార్యులు. ఏభై ఉత్త రాలు రాశాడు. ఒక్కోసారి ఆయన ఫోన్ చేసినపుడు తాను లేనని చెప్పించేవాడు. కానీ ఎప్పటికైనా దొరకక తప్పదేమోననే శంక మనసును పీడిస్తూనే ఉన్నది.

కొంతకాలం గడిచింది. ఫోన్ మోగింది. ''విశ్వపతి స్పీకింగ్..'' అన్నాడు విశ్వపతి.

''నమస్కారం సార్.. నేను అభినవ నన్నయ్య..''

''నమస్కారం. చెప్పండి.. మళ్ళీ ఏదైనా పంపుతు న్నారా?''

''ఇంతకు ముందిచ్చింది ఇంకా ప్రచురించలేదు. అది రాగానే మరో నవల..''


''అదేంటి? ఇంతకు ముందిచ్చినది ప్రచురిం చాంగా..''

''ఆ! ఎప్పుడూ... నాకు తెలియదే..''

''రెండువారాల క్రితం ప్రచురించాం. మీకు కాంప్లి మెంటరీ కాపీని కూడా పంపించాం.''

''అవునవును.. రెండు వారాల క్రితం కాపీ అందింది. కానీ దాంట్లో నా నవలలేదే? పొరపాటున పంపించారేమో ననుకున్నాను.''

''లేదు లేదు.. దాంట్లోనే ప్రచురించాం.''



''లేదు లేదు.. నాకెక్కడా కనిపించలేదు. అసలు...''

''అయ్యా అభినవ నన్నయ్యగారూ.. మీ నవలను మొదట మా సబ్ ఎడిటర్స్ ఎడిట్ చేసి నవలికగా కుదించారు. తరువాత మా అసిస్టెంట్ ఎడిటర్ చదివి విషయాన్ని కథ సైజుకు కుదించాడు. ఆ తరువాత మా ఛీఫ్ సబ్‌ఎడిటర్ చదివి మినీ కథ సైజుకు ఎడిట్ చేసి నా టేబుల్ మీదకు పంపించాడు. అందులో నాకు రెండు మూడు లైన్లకు మించి విషయం కనప డలేదు. అందువలన దానిని కార్డు కథగా కుదించి ప్రచురించాను. ఇరవై రెండవ పేజీలో ఎడమవైపు మొదటికాలంలో సగంకాలమ్ బాక్స్‌లో చూడండి.'' ఫోన్ పెట్టేశాడు విశ్వపతి.

★